
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



ఆవులయ్య స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెంలో ఆవులయ్య స్వామి తిరునాళ్ల గురువారం నిర్వహించారు. భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం గురువారం 512.10 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 6,325, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
బాపట్ల	6.26	4.43
నరసరావుపేట	6.28	4.45
గుంటూరు	6.26	4.43

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూంల రక్షణకు ప్రత్యేక చర్యలు



బాపట్ల: ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంల రక్షణ చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూం ఏర్పాట్లుపై పోలీసు, రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర సాయుధ దళాలు, జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులను ఉపయోగించుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గంధం రవీందర్ పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం అలంకారంలో శ్రీవారు



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి రుక్మిణీ కల్యాణం అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వైభవంగా శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు



అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలో కొలువైన గంగా, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శాంతి హోమాలు, యాగాలు, చండీపారాయణ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదానంలో నాలుగు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జీవీకి నోటీసులు

వినుకొండ: మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ నాయకుడు జి.వి.ఆంజనేయులుకు ఎన్నికల అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు అందజేశారు. ఇటీవల ఈపూరు మండలం కొండ్రముట్లలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ రిటర్నింగ్ అధికారి ఆంజనేయులపై గురువారం నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దీనిపై జీవీ ఆంజనేయులు 24 గంటల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా శిలాబింబి ప్రతిష్ట మహోత్సవం



హుస్సేన్ నగరం(పెదకూరపాడు): పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో కొలువై ఉన్న రేణుకా అంకమ్మతల్లి, పోతురాజు శిలాబింబి ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సలసల ఎండ.. పండుటాకుల విలవిల

అవ్వాతాతలకు అదే కష్టం

- రెండవ రోజూ పింఛన్ కష్టాలు
- రోజంతా ఎండలో ఎదురుచూపులు
- పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు
- సచివాలయాల వద్ద వృద్ధుల ఇక్కట్లు
- అష్టకష్టాలు పడ్డ దివ్యాంగులు
- చంద్రబాబు ఉసురు తప్పదని శాపనార్థాలు

బాబు అండ్‌కోపై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. మండే ఎండల్లో పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితులు కల్పించిన చంద్రబాబు, ఆయన అనుయాయులపై అవ్వాతాతలు, దివ్యాంగులు మండిపడుతున్నారు. తామున్న పరిస్థితుల్లో సుదూరంలోని సచివాలయాలకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోగలమని నిలదీస్తున్నారు. అనారోగ్యంతో మంచాన పడ్డవారూ పచ్చపార్టీ తీరుపై మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు ఇంటివద్దకు రాకుండా అడ్డుకున్న వారికి ఉసురు తప్పదని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని వారు హెచ్చరిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రెండవ రోజూ వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ కష్టాలు తప్పలేదు. మొదటి రోజు పంపిణీ పూర్తికాక పోవడంతో రెండరోజూ గురువారం సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మండే ఎండల్లో క్యూలైన్లలో నిల్చొని ఎదురుచూపులు చూశారు. పింఛన్ కోసం సాయంత్రం వరకూ అక్కడే గడపాల్సి వచ్చింది. దీంతో రోగులు, దివ్యాంగులు మరింత కష్టాలు పడ్డారు. చాలా గ్రామాల్లో సచివాలయాలు లేకపోవడంతో సుదూరంలో ఉన్న గ్రామ సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు, దివ్యాంగులకు మరింత ఇబ్బందిగా మారింది.కొన్నిచోట్ల భోజనం, మంచినీటి సదుపాయం లేక నానా బాధలు పడ్డారు. కొన్ని సచివాలయాల పరిధిలో బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకరావడం ఆలస్యం కావడంతో పింఛన్ పంపిణీ మరింత ఆలస్యమైంది. దీంతో కొందరు రాత్రి వరకూ అక్కడే వేచి చూశారు. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం, పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు, బాపట్ల పట్టణంలో తొలిరోజు పింఛన్ల పంపిణీ జరగలేదు. రెండో రోజు పెద్ద మొత్తంలో ఇక్కడ పింఛన్‌దారులు పోగయ్యారు. దీంతో వారు సాయంత్రం వరకూ నగదు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.



చినగంజాం మండలం కొత్తపాలెం సచివాలయానికి రిక్షాపై వస్తున్న లబ్ధిదారులు

జీర్ణించుకోలేని పచ్చపార్టీ

వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి వలంటీర్ల ద్వారా పింఛన్ మొత్తాన్ని ప్రతి నెలా ఇంటి వద్దే అందజేశారు. వలంటీర్ల వ్యవస్థ వృద్ధులు, దివ్యాంగులకు అనుకూలంగా మారింది. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతోపాటు అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను వారి ద్వారానే ప్రజలకు అందిస్తోంది. ఈ విధానం ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చింది. ఇది జీర్ణించుకోలేని పచ్చపార్టీ, వారి అనుయాయులు వలంటీర్ వ్యవస్థను నిలిపివేయాలని కోర్టుతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో కమిషన్ ఎన్నికలు ముగిసేవరకూ వలంటీర్లను పక్కన బెట్టాలని ఆదేశించింది. సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి గ్రామంలో సచివాలయాలు లేకపోవడంతో సుదూరంలోని సచివాలయాలకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులకు, దివ్యాంగులు, రోగులకు కష్టంగా మారింది. జిల్లాలో అర్బన్ ప్రాంతాలతో కలిపి 29 మండలాలు ఉండగా 477 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,34,943 మంది పింఛన్ దారులకు గాను రూ. 69,28,37,500 చెల్లించాల్సి ఉంది.

అవస్థలు పడుతూ వచ్చా !



నా వయస్సు 82 సంవత్సరాలు. నేను పింఛన్ తీసుకోవడానికి చాలా అవస్థలు పడుతూ వచ్చాను. నేను ఒక్కదాన్నే రాలేక నా కోడలిని వెంట తెచ్చుకోవాల్సి వచ్చింది. ఈ పింఛన్ కోసం నా కోడలు కూడా ఒక పూట ఇంటి వద్దనే ఉండాల్సి వచ్చింది. గత నెల వరకు వలంటీర్లు చక్కగా ఇంటి వద్దకే వచ్చి నాకు డబ్బులు ఇచ్చి వెళ్లేవారు. ఇలా అయితే రాబోయే రోజుల్లో మేము చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మళ్లీ నాకు పాత రోజులే గుర్తుకు వచ్చాయి.

– గోనే వెంకాయమ్మ, కారంచేడు

మా ఉసురు తగలకుండా ఉండదు



మమ్మల్ని కన్నకొడుకు మాదిరిగా చూసుకుంటూ నెలానెలా ఒకటో తేదీనే మాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ ఇప్పిస్తుంటే చంద్రబాబు ఆపివేయించడం ఎంత వరకు న్యాయంగా ఉందో చెప్పాలి. చంద్రబాబుకు మా ముసలోళ్ల ఉసురు తప్పకుండా తగులుతుంది. నాకు గుండె సంబంధిత సమస్యతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఎంతో కష్టపడి ఎండలో పింఛన్ కోసం సచివాలయానికి వచ్చాను.

– మార్పు భాగ్యమ్మ, ఉజిలిపేట, చీరాల

రెండు రోజుల నుంచి ఎండలో తిరుగుతున్నా



జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పింఛన్ తీసుకునేందుకు అసలు కష్టం ఉండేది కాదు. మా వలంటీర్ నేను ఇంటి వద్ద ఉంటే అక్కడ, పొలం వెళితే అక్కడకు కూడా తీసుకొచ్చి అందించేవారు. అప్పుడు పింఛన్ కోసం చింత ఉండేది కాదు. రెండు రోజులు నుంచి ఎండలో తిరుగుతున్నా, పింఛన్ ఇవ్వడం లేదు. వస్తుందా... రాదా? అని భయం వేస్తోంది. చంద్రబాబు ఏం సాధిస్తాడని ఇంత కక్ష సాధిస్తున్నాడు.

–కామిశెట్టి లక్ష్మి, పంగులూరు

రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి



సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియమితులయ్యారు. ఆయన గుంటూరులోని రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఐజీగా విధులు నిర్వర్తించిన జి.పాలరాజు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠిని అధికారులు నియమించారు. 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన 2016–18లో గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పల్నాడు ఎస్పీగా బిందుమాధవ్



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు గతంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా, ఎస్ఈబీ ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది. గతేడాది ఏప్రిల్ 8న గ్రేహౌండ్స్ ఎస్పీగా పదోన్నతి పొంది పల్నాడు నుంచి వెళ్లారు. తిరిగి జిల్లాకు ఎస్పీగా వచ్చారు. పల్నాడు జిల్లా తొలి ఎస్పీగా పనిచేసిన వై. రవిశంకర్‌రెడ్డి మంగళవారం బదిలీ అయిన సంగతి తెలిసిందే.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలే అభ్యర్థుల విజయానికి సోపానాలు
- నూరుశాతం హామీలు అమలు చేసిన ఘనత జగనన్నదే



మాట్లాడుతున్న అయోధ్య రామిరెడ్డి, పక్కన ఎంపీ మోపిదేవి , నియోజకవర్గ అభ్యర్థి గణేష్

రేపల్లె రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రతి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నట్లు బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. పట్టణంలోని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 175 స్థానాల గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్న తమకు ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే అభ్యర్థుల విజయానికి సోపానాలని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల్ని నూరు శాతం అమలు చేసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రల్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల అమలతో పాటు రాష్ట్ర ప్రజలకు ఎంత మేలు జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలిసిందేనని వివరించారు. స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు తన బృందంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్లను సేవలకు దూరం చేశారని ధ్వజమెత్తారు. మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమలో నిర్వహిస్తున్న యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల రథసారథికి తామంతా అండగా ఉన్నామంటూ స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొంటూ మద్దతు తెలియజేస్తున్నారని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి 62 నుంచి 65 శాతం ఓటింగ్ ఉందని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలని అయోధ్య రామిరెడ్డి పిలుపునిచ్చారు.

పొత్తులు లేకుండా చంద్రబాబుకు పోటీచేసే దమ్ముందా..?

పొత్తులు లేకుండా తేదేపా నాయకుడు చంద్రబాబుకు పోటీ చేసే దమ్ముందా? అంటూ వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సవాలు విసిరారు. తన రాజకీయ జీవితం ప్రారంభించిన నాటి నుంచి ప్రతి ఎన్నికల్లో చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడటం పరిపాటని విమర్శించారు. ఒక మారు కమ్యూనిస్టులతో మరోమారు కాంగ్రెస్‌తో, ఇంకో మారు బీజేపీ, జనసేనలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు అండగా నిలవండంటూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కోరుతుంటే పొత్తులతో ప్రజల్ని మరోమారు మోసం చేసేందుకు చంద్రబాబు ఎన్నికలకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. జనసేన పార్టీ పెట్టింది చంద్రబాబు బాగుకోసమేనన్నట్లుగా పవన్ కల్యాణ్ తీరు ఉందని విమర్శించారు. పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి కష్టపడిన అభ్యర్థుల్ని కాదని తేదేపా నేతలకు జనసేన కండువాలు కప్పి టికెట్లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఆయన మిత్రబృందం కుట్రల వల్ల ఎన్నికల సంఘం వలంటీరులను సేవలకు దూరంగా ఉంచటం వల్ల పింఛన్‌దారులైన అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పింఛన్ తీసుకోవడానికి వెళ్లి పెనమలూరుతో పాటు ఇతర ప్రాంతాలలో వడదెబ్బకు గురై ప్రాణాలు వదిలిన అవ్వాతాతల పాపం చంద్రబాబుదేనని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌ల గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నట్లు మోపిదేవి తెలిపారు. నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పార్టీ అభ్యర్థుల గెలుపునకు శక్తివంచన లేకుండా పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పాల్గొన్నారు.

రిక్షా, చేనేత కార్మికులకు అండగా వైఎస్సార్ సీపీ

వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

చుండూరు(భట్టిప్రోలు): రిక్షా, చేనేత కార్మికులను వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చుండూరు మండలం మోదుకూరులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆరికాటి రంగారావు ఇంట్లో మగ్గం నేశారు. తాను వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఐదు దఫాలుగా రూ. 24 వేలు లబ్ధి పొందానని..... మళ్లీ జగనన్నే రావాలని రంగారావు ఆయన్ను ఆశీర్వదించారు.అనంతరం అశోక్ బాబు కొద్ది దూరం పాటు రిక్షాలో వృద్ధుడ్ని ఎక్కించుకుని నడిపారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ రిక్షా, చేనేత కార్మికులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



మోదుకూరులో మగ్గం నేస్తున్న అశోక్‌బాబు



రిక్షా తొక్కుతూ....

వైఎస్సార్ సీపీలో 25 కుటుంబాలు చేరిక



పార్టీలోకి చేరిన వారితో చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని పాత మాగులూరు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి రామిరెడ్డి, కారసాని కోటిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికీ ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మీకు పుణ్యం...మాకు సేవా ఫలం

- మిగిలిన ఆహారాన్ని అందిస్తూ.. కాలే కడుపులకు పట్టెడన్నం
- నాలుగేళ్ల సేవా ప్రస్థానంలో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్
- ఆహారాన్ని పారేయొద్దు..మాకందించండి.. మీ పేరుతోనే పంచిపెడతామంటున్న ట్రస్ట్ సభ్యులు

గుంటూరు మెడికల్ : అన్నం పర బ్రహ్మ స్వరూపం. అలాంటి ఆహారాన్ని శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల వేళల్లో వృథాగా పడేస్తుంటారు. అలా కాకుండా మానవతా దృక్పథంతో ఆలోచిస్తే కాలే కడుపుల క్షుద్బాధను తీర్చగలమంటున్నారు వాళ్లు. ఆకలితో అలమటించేవారికి పట్టెడన్నం పెట్టే మార్గం కోసం అన్వేషించారు. ఆ ఆలోచనలోంచి పుట్టుకొచ్చిందే మిగిలిపోయిన ఆహార సేకరణ. 'పదార్థాలను వృథాగా పార బోయకుండా మాకు అందిస్తే మీ పేరుతో మేమే పేదలకు భోజనం పెడతాం. వారి ఆకలి తీరుస్తాం.మీకు పుణ్యం ..మాకు సేవా ఫలం' అంటూ నాలుగేళ్లుగా తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. వారే గుంటూరు నగరానికి చెందిన 'గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులు. అన్నార్తుల సేవలో తరిస్తోన్న ట్రస్ట్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

మహమ్మారి వేళ మొగ్గతొడిగి..

గుంటూరు జీజీహెచ్ డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ ఎదురుగా ప్రధాన గేటు వద్ద వైఎస్సార్ ఫుడ్ కోర్టును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉచితంగా అన్నదానం చేస్తూ ఉండటంతో కార్పొరేషన్ అధికారులు ఫుడ్ కోర్టును కూడా వారికి అప్పగించారు. ఇక్కడ ప్రతిరోజూ మధ్యాహ్నం 300 మందికి పైగా ఉచితంగా భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్నారు. మహమ్మారి సమయంలోనూ కోవిడ్ పాజిటివ్ బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి ఉచితంగా భోజనం అందించి ఈ ట్రస్ట్ సభ్యులు పలువురి మన్ననలు పొందారు.

సేవా నిరతి..ప్రశంసల హారతి

మహమ్మారి విజృంభించే తొలి రోజుల్లో కోవిడ్ సోకి మరణిస్తే వారి భౌతిక కాయాల్ని పట్టుకునేందుకు కుటుంబ సభ్యులు సైతం భయపడిపోయేవారు. మరణించిన వారిని ఆస్పత్రుల్లోనే వదిలేసేవారు. అందరూ ఉండి అనాథలుగా శవాగారాల్లో ఉన్న భౌతికకాయాల్ని చూసి చలించిన నగరానికి చెందిన కొందరు యువకులు 2020లో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యికి పైగా భౌతిక కాయాలకు వారి సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వ హించారు. సొంతంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి రోగుల్ని వారికి నచ్చిన ఆస్పత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించేవారు. ఇప్పుడు కూడా ఈ సేవలను కొనసాగిస్తున్నారు.



గుంటూరు జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు ఉచిత భోజనం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్

ఆకలి తీరుస్తూ..ఆదర్శంగా నిలుస్తూ..

మహమ్మారి విజృంభించిన రోజుల్లో లాక్‌డౌన్ కారణంగా పనుల్లేక పస్తులతో అలమటించిన వారి దైన్యాన్ని చూసిన ట్రస్టు సభ్యులు వారి కోసం ఏదో చేయాలని సంకల్పించారు. పలు ప్రాంతాల నుంచి చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన రోగుల సహాయకులకు బయట ఎక్కడా భోజనం లభించని దుస్థితి చూసారు. తమ వేతనాల్లో నుంచి కొంత చందా వేసి ఉచితంగా భోజనం అందించడం ప్రారంభించారు. అయితే అన్నార్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో సేవల విస్తృతిని పెంచేందుకు ముందుకొచ్చారు. ఆహార సేకరణపై దృష్టి సారించారు.ఇందులోంచి పుట్టుకొచ్చిందే మిగులు పదార్థాల సేకరణ.

ముందస్తు ప్రణాళికతో ముందుకు..

రోజూ జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో శుభ కార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటి డేటాను ముందురోజు సేకరిస్తారు. ఆయా నిర్వాహకులను సంప్రదిస్తారు. మిగులు పదార్థాలను పార బోయకుండా సమాచారమిస్తే వచ్చి సేకరిస్తామని చెబుతారు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదించి శుచి, శుభ్రతగా ఉండే ఆహార పదార్థాలను సేకరిస్తారు. వాటిని ఫుడ్ కోర్టుకు తరలించి మరోసారి తనిఖీ చేసి అన్నార్తుల కడుపు నింపే కార్యక్రమంలో తలమునకలవుతారు. ఇలా నాలుగేళ్లుగా సేవలను సాగిస్తూ, ప్రతిరోజూ 300 మంది ఆకలిని తీరుస్తున్నారు.

ట్రస్ట్ సేవలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లివే..

8143222456, 9397602553, 7396722171

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే ఆమంచి రాజీనామా

చీరాల: చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వైఎస్సార్ సీపీ ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. తన భవిష్యత్ రాజకీయానికి ఈనెల 9న తన అనుచరులు, కార్యకర్తలతో చర్చించి వివరాలు వెల్లడిస్తానని లేఖలో వెల్లడించారు.

రెండిళ్లలో వరుస దొంగతనాలు

రెండు కిలోల వెండి, 11 గ్రాముల బంగారం చోరీ



మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండు కిలోల వెండి, 11 గ్రాముల బంగారంతో పాటు రూ 5 వేలు నగదు అపహరణకు గురయ్యాయి. ఏఎస్సైలు సైదా, మహబూబ్ బాషాల వివరాల మేరకు.. స్థానిక విద్యానగర్ రెండో లైనులో ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో దాచిన రెండు కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. ఇదే వీధిలో గనిపిశెట్టి భాస్కరరావుకు చెందిన ఇంట్లో బీరువా పగులగొట్టి అందులో ఉన్న 11 గ్రాముల పలు ఆభరణాలతో పాటు రూ.5 వేల నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది రెండిళ్లలో వేలిముద్రలు సేకరించినట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక రోగి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకమ్మరావునగర్‌కు చెందిన ఎ.రాజు (32) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న సిగరెట్ కాల్చే క్రమంలో అగ్గిపుల్ల జేబులో వేసుకున్నాడు. మంటలు వ్యాపించి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్‌తో చరిత్ర సృష్టిస్తుంది

రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్య సభ సభ్యులు అయోధ్య రామి రెడ్డి

మోదుకూరు(వేమూరు) రానున్న ఎన్నికల్లో అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ సాధించి చరిత్ర సృష్టిస్తుందని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చుండూరు మండలం మోదుకూరులో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబు ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలుచేసిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందాయన్నారు. మరోసారి అధికారం చేపట్టాక జన సంక్షేమంలో కొత్త ఒరవడి చోటు చేసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గుంటూరు జిల్లాలో చేపట్టే బస్సు యాత్రను విజయ వంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కదిలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. వేమూరులో వరికూటి అశోక్‌బాబు గెలుపు ఖాయమని ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాది సుబ్బారావు, ఎంపీపీ జాలాది రూబేను, దాట్ల సౌజన్య, మండల పార్టీ అధ్యక్షులు అనపురెడ్డి రఘురామి రెడ్డి, గాదె శివరామ కృష్ణా రెడ్డి, బొల్లిముంత ఏడుకొండలు, మోదుకూరు హరిబాబు, మాజీ జడ్పీటీసీ విష్ణు మొలకల. వెంకటేశ్వరావు, జేసీసీ కన్వీనర్లు సుబ్బారావు, అనపురెడ్డి వీరా రెడ్డి, కోగంటి లవకుమార్, ఎంపీపీ లలిత కుమారి, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, పెరికల పద్మారావు, కొండ శివ ప్రసాద్ రెడ్డి , గుమ్మడి రవిరాజా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశోక్‌బాబుతోనే వేమూరు అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- వెల్లటూరు ఎస్టీ కాలనీ వాసులతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

వెల్లటూరు(భట్టిప్రోలు): వేమూరు నియోజకవర్గాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దడం కేవలం వరికూటి అశోక్ బాబుతోనే సాధ్యమవుతుందని ఆయన సతీమణి లక్ష్మి స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కంకణ బద్ధులై ఉన్నారని ఆమె వ్యాఖ్యానించారు. గురువారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఎస్టీ కాలని వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్లను అందించేవారని, టీడీపీ నేతల పుణ్యమాని ఆ సౌకర్యం ఇప్పుడు దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను లబ్ధిదారుల ఉసురు చంద్రబాబుకు తగలక మానదన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం వద్ద సొమ్ము లేక పింఛన్లను సకాలంలో అందించడంలేదంటూ టీడీపీ మరో అబద్ధపు ప్రచారాన్ని చేపట్టడం హస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం ఎస్టీ కాలనీకి చెందిన మహిళలతో ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు దారావత్ కుమారిబాయి, కొతరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు నిమ్మగడ్డ ప్రమీల, చౌటూరి రవీంద్ర, పప్పల విజయరాజు, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతి సీఎం జగన్ తోనే సాధ్యం



ముస్లింలతో మాట్లాడుతున్న చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్

ఇఫ్తార్ విందులో చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్

చీరాల టౌన్: ముస్లింల అభ్యున్నతికి పాటుపడిన ముఖ్యమంత్రుల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముందువరుసలో ఉంటారని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ అన్నారు. గురువారం చీరాల నవాబుపేటలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో ముచ్చటించారు. చంద్రబాబు ప్రభుత్వంలో మైనారిటీలు అణచివేతకు గురయ్యారని ఆరోపించారు. కానీ జగన్ మోహన్ రెడ్డి అల్పసంఖ్యాక వర్గాలకు అగ్రస్థానంలో నిలిపే నిర్ణయాలను తీసుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిని మళ్లీ సీఎంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కోట్ల రూపాయలతో చీరాల అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఈ సందర్భంగా కరణం కోరారు. అనంతరం ఇఫ్తార్ విందులో భాగంగా ముస్లిం సోదరులకు వడ్డించారు. కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాల రెడ్డి, షేక్ సత్తార్, దర్గా ఖాజావలీ, పఠాన్ మునీర్, పఠాన్ సాదిక్ అలీఖాన్, సయ్యద్ బాజీ, షేక్ రియాజ్, గుంటూరు వెంకట సుబ్బారావు, కల్యాణ్ విజయ్ ప్రకాష్, రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

యడ్లపాడు: కొండవీటి కళా పరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా రెండు కళాపరిషత్‌లు కలిసి నాటికల పోటీలు నిర్వహించడం విశేషం. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఆయా పరిషత్‌లు నాటికల ప్రదర్శనలకు పోలీసుల నుంచి అనుమతిని సైతం పొందాయి. ఏప్రిల్ 7, 8, 9, 10 తేదీల్లో వరుసగా నాలుగు రోజుల పాటు 12 నాటిక ప్రదర్శనలు జరగనున్నాయి. ప్రతిరోజు నాటిక ప్రారంభ పూజా కార్యక్రమం మినహా గతంలో మాదిరిగా ప్రదర్శన మధ్యలో దాతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నిర్వహించే సభా కార్యక్రమం ఉండదని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8 నుంచి 11 గంటలకు ప్రతిరోజు మూడు నాటిక ప్రదర్శలు ఉంటా యన్నారు. ఇలా రెండు పరిషత్‌లు కలిసి రెండు గ్రామాల్లో రెండేసి రోజులు చొప్పున నాలుగు రోజుల పాటు కళావిందు చేయనున్నాయి. మొదటి రెండు రోజులు లింగారావుపాలెం గ్రామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలోనూ, తదుపరి రెండు రోజులు యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళావేదిక ప్రాంగణంలోనూ నాటిక ప్రదర్శనలు కొనసాగనున్నాయి.

కర్లపాలెం రూపురేఖలు మారుస్తా

వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి



కర్లపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి

కర్లపాలెం: జగనన్న ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్లపాలెం రూపురేఖలు మారుస్తానని బాపట్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి హామీ ఇచ్చారు. కర్లపాలెంలో రహదార్ల నిర్మాణంతోపాటు తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడతానని ఆయన స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసిన జగనన్ననే మళ్ళీ సీఎంగా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కర్లపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి మాట్లాడుతూ..బాపట్లను జిల్లా చేసి, మెడికల్ కళాశాలను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ కు జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. బాపట్ల జిల్లా కేంద్రంగా మారడంతో సమీపంలోని కర్లపాలెం శర వేగంగా అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. ఈ ప్రాంతంలోని భూముల ధరలు పెరిగిన తీరే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, రాతంశెట్టి లక్ష్మణరావు, అమీర్‌బేగ్, సర్పంచ్‌లు అక్కల శ్రీనివాసరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, నాదెండ్ల భానుప్రసాద్, పార్టీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, పెద్ద శ్రీనివాసరెడ్డి, ఆనందబాబు, ఆట్ల హరిబాబురెడ్డి, సాగర్, సలగల ధర్మేంద్ర, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

న్యూ అసోసియేషన్ అధ్యక్షురాలు రేవతి



బాస్కెట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు రూరల్: బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూర్ డిస్ట్రిక్ బాస్కెట్ బాల్ అధ్యక్షురాలు మారెళ్ళ రేవతి గురువారం తెలిపారు. అంకిరెడ్డిపాలెంలోని బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని బాలబాలికలకు వేర్వేరుగా శిక్షణ శిబిరం శనివారం నుంచి మే నెలాఖరు వరకు నిర్వహిస్తామని తెలిపారు. అంకిరెడ్డిపాలెంలోని సింథటిక్ కోర్టులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాల్గొనదలచిన వారు ఈ నెల 6వ తేదీ లోపు తమ పేర్లు అంకిరెడ్డిపాలెంలోని బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద లేదా నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని చెప్పారు. పి.సుకన్య, వెంకటకృష్ణ శిక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

అద్భుత సృజన

- తేలికపాటి వాహనాన్ని రూపకల్పన చేసిన విద్యార్థులు
- పాఠశాల స్థాయిలో అద్భుత ఆవిష్కరణ
- రూ.లక్షన్నర ఆర్థిక సాయమందించిన పాఠశాల యాజమాన్యం
- లీటర్ పెట్రోలుతో 30 కిలోమీటర్ల మైలేజ్
- నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జైరామ్, సుభాష్ ప్రతిభ
- పలువురి ప్రశంసలు



గోకార్ట్ వాహనాన్ని నడుపుతున్న జైరామ్, సుభాష్

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్ కళాశాలల్లో చేసే సాంకేతిక ఆవిష్కరణలను తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే చేసి చూపించారు. ప్రతిభాపాటవాలతో పదిమందికి పనికొచ్చే ఆవిష్కరణకు బీజం పోశారు గుంటూరు అమరావతిరోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన జైరామ్, సుభాష్. పాఠ్య పుస్తకాల్లోని జ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. సమాజానికి ఉపయోగపడేలా నవ్య ఆవిష్కరణను రూపొందించడంలో సఫలీకృతులయ్యారు. వారి మేధస్సులోంచి పుట్టిందే తేలికపాటి వాహనం.

గో కార్ట్ కు ప్రాణం

మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుల మేధస్సుకు సమంగా తక్కువ ఖర్చుతో ఓ వాహనాన్ని తయారు చేసేందుకు జైరామ్, సుభాష్ ఉద్యుక్తులయ్యారు. బహుళ ప్రయోజనకారిగా ఉపకరించాలని నిర్ణయించుకున్నారు. అటు వాణిజ్యపరంగానూ, ఇటు ప్రజాజీవనానికి అనువుగా ఉండేలా తేలికపాటి వాహనానికి ప్రాణం పోశారు. పెట్రోల్‌తో నడిచే జీఎక్స్–390 ఇంజన్‌ను అమర్చారు. లీటర్‌కు 30 కిలోమీటర్ల మైలేజీ వచ్చేలా రూపొందించారు. దీనికి ''గోకార్ట్'' అని నామకరణం చేశారు. వీరి పట్టుదల, ఏకాగ్రతను గుర్తించిన పాఠశాల యాజమాన్యం తమ వంతుగా రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఇద్దరు కూర్చుని ప్రయాణించడంతో పాటు సరుకులను రవాణా చేసేందుకు వీలుగా ఈ తేలికపాటి వాహనాన్ని డిజైన్ చేశారు. గోకార్ట్ తయారీకి అవసరమైన సామగ్రిని విద్యార్థులే స్వయంగా సమకూర్చుకున్నారు. టైర్లు, స్టీల్ రాడ్లు, బేస్‌మెంట్ ఇతర మెటీరియల్ ను తెప్పించి వాహనానికి ఊపిరిపోశారు.

ప్రయోగం..విజయవంతం

తాము రూపొందించిన గోకార్ట్ వాహనాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. వాహనంలో జైరాం, సుభాష్ కూర్చొని, డ్రైవింగ్ చేస్తూ మైదానం చుట్టూ తిరిగి చక్కర్లు కొట్టారు. ఇరుకైన వీధుల్లోనూ సంచరించేలా ఈ వాహనాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆవిష్కర్తలు చెబుతున్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కోగంటి శ్రీకాంత్‌బాబు, డాక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ సుధీర్, సీఓఓ శ్రీకాంత్ అభినందించారు.

టీడీపీ, జనసేన నాయకుల బాహాబాహీ

జనసేన మండల పార్టీ కన్వీనర్‌కు గాయాలు

మాచర్లరూరల్ : ఎన్నికల ప్రచార వాహనంపై తమకు ప్రాధాన్యమివ్వకుండా జనసేన నాయకుల పెత్తనం ఏమిటంటూ టీడీపీ శ్రేణులు ప్రశ్నించడంతో ఇరుపార్టీల నాయకులు నడివీధిలో పరస్పర దాడులకు దిగారు. ఇరుపార్టీల నాయకుల మధ్య తలెత్తిన ఘర్షణలో జనసేన మండల పార్టీ కన్వీనర్ సాంబశివరావుకు గాయాలయ్యాయి. ఈనెల 3న రాత్రి సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని తాళ్లపల్లిలో టిడిపి నియోజక వర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే సమయంలో జనసేన వీర మహిళ అధ్యక్షురాలు, మండల పార్టీ కన్వీనర్ ప్రచారం చేస్తుండగా బ్రహ్మనాయుడు వర్గీయులు అడ్డుకున్నారు. ఒక్క ఓటు కూడా వేయించలేని జనసేన పార్టీ వారు మా మీద పెత్తనం చేయడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రచార రథాన్ని ఆపాలంటూ గొడవకు దిగారు. దీనిపై జనసేన మండల పార్టీ కన్వీనర్ వర్గీయులు టీడీపీ వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొన్నటి వరకు వైఎస్సార్‌సిపిలో ఉండి ఈ రోజు స్వప్రయోజనాలకు టీడీపీలోకి వచ్చి మాపై విమర్శలు చేస్తే బాగుండదంటూ ఘర్షణకు దిగారు. ఈ పరిణామంతో ఇరుపార్టీలవారు రెండు వర్గాలుగా విడిపోయారు. పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ ఘర్షణలో జనసేన మండల పార్టీ కన్వీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ పరిణామంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నాయకులే నడివీధుల్లో కొట్టుకోవడాన్ని స్థానికులు అసహ్యించుకుంటున్నారు. కాగా ఘటనపై పోలీసు కేసు నమోదుకాకపోవడం గమనార్హం.

జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో చదువుకు దూరమైన, బడిఈడు పిల్లలను గుర్తించాలని సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు కలిగి, బడి మధ్యలో మానేసిన విద్యార్థులతో పాటు ఐదేళ్లకు పైబడి బడిఈడు కలిగిన బాలల వివరాలపై ఈ నెల 10వ తేదీలోపు క్షేత్ర స్థాయిలో వివరాలు నమోదు చేయాలని సీఆర్పీలకు తెలిపారు. మండలాల వారీగా ఎంఈవోలు ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి, సీఆర్పీలతో పకడ్బందీగా సర్వే నిర్వహించి, వివరాలను గూగుల్ ఫాంలో పూర్తిచేయించాలని ఇదే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయాలని పేర్కొన్నారు.

తెనాలి శిల్పకారుల కళా సృజన



విగ్రహాలతో శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తెనాలి: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నగరంలో ప్రతిష్ట నిమిత్తం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాలను రూపొందించినట్లు ప్రముఖ శిల్పకారులు, తండ్రీకొడుకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తెలిపారు. గురువారం వీరు తయారుచేసిన విగ్రహాలను అహ్మదాబాద్ తరలిస్తున్న సందర్భంగా స్థానిక విలేకరులకు వివరాలను తెలియజేశారు. పెడస్టల్, విగ్రహం కలిపి మొత్తం 10.5 అడుగుల ఎత్తులో ఫైబర్ గ్లాస్‌తో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలను తయారు చేశామన్నారు. పార్లమెంటును పోలిన పెడస్టల్ డిజైన్‌లో అంబేడ్కర్ కుర్చీలో కూర్చొని రాజ్యాంగాన్ని రచిస్తున్నట్లు తాము తొలిసారిగా విగ్రహాన్ని తీర్చిదిద్దామన్నారు. ఈ విగ్రహానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. తొలిసారిగా గుజరాత్ రాష్ట్రానికి రెండు విగ్రహాలను పంపుతున్నామని చెప్పారు. భారత ఆర్థిక రాజధాని ముంబయికి కూడా ఇదే తరహాలో కాంస్య విగ్రహం తయారుచేస్తున్నామని వివరించారు. భారతదేశం నలుమూలల నుంచి అంబేడ్కర్ విగ్రహానికి ఆర్డర్లు రావటం సంతోషంగా ఉందన్నారు.

ఊయల.. ఉరితాడైంది !

ప్రమాదవశాత్తు విద్యార్థి మృతి

గురజాల : ఊయల ఉరితాడై విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని దైదలో నివసిస్తున్న కొల్లిపాక శ్రీను, శివలక్ష్మిల కుమారుడైన నారాయణ (13) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో ఉదయం పాఠశాలకు వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి సమీపంలో ఉన్న రావి చెట్టుకు స్నేహితులతో కలసి చీరలు తీసుకుని వెళ్లి ఉయ్యాల ఏర్పాటు చేసుకున్నారు. నారాయణ అందులో కూర్చుని తిరుగుతుండగా మెడకు ప్రమాదవశాత్తు చీరలు చుట్టుకున్నాయి. ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు.

జిల్లాలో రూ.1.34 కోట్ల విలువైన నగదు, మద్యం సీజ్

నరసరావుపేట: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలైన దగ్గర నుంచి రూ.39.02 లక్షల నగదు, రూ.39.81 లక్షల విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులు వెరసి మొత్తం రూ.1.34 కోట్ల విలువైన సొత్తును సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పక్కా అకౌంటింగ్ ఉన్న వాటికి 24 గంటల్లో రిలీజ్ చేశామన్నారు. సీ విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారుల ద్వారా పరిష్కరించామన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో కలిపి 730 అనుమతులు ఇవ్వటం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. ఎవరూ ఆ నిబంధనలు అతిక్రమించవద్దని పేర్కొన్నారు. బాబూ జగజ్జీవనరామ్ జయంతిని శుక్రవారం పార్టీలకు అతీతంగా నిర్వహించుకోవచ్చన్నారు. ఓటరు జాబితా కూర్పులో తొలగింపులు, మార్పులు ఆపివేయటం జరిగిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 14 లోపు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.